సాక్షి ప్రకాశం

బుధవారం । 27 । మార్చి । 2024



పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామని జెడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే అభ్యర్థి శివప్రసాదరెడ్డి అన్నారు. - 8లో..



అంతర్ జిల్లాల దొంగ అరెస్టు

అంతర్ జిల్లాల దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.52 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు మార్కాపురం సీఐ తెలిపారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

రంజాన్ వేళలు

బుధవారం - ఇఫ్తార్ : సా॥ 6.27
గురువారం - సహరీ : ఉ॥ 4.46



న్యూస్‌రీల్

విద్యుత్ బకాయిలపై దృష్టి సారించండి

- ఎస్‌ఈ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎస్‌ఈ సత్యనారాయణ

మార్కాపురంటౌన్: మార్కాపురం, యర్రగొండపాలెం సబ్ డివిజన్‌లోని విద్యుత్‌బిల్లులు త్వరితగతిన వసూలు చేయాలని ఎస్‌ఈ కేవీజీ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం సబ్‌డివిజన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ బకాయిలు సుమారు రూ.42 కోట్లు, యర్రగొండపాలెం సబ్‌డివిజన్‌లో రూ.35 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, సిబ్బంది బకాయిలను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో నిరంతరం విద్యుత్ సరఫరాకు తగు చర్యలు తీసుకోవాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. ఏడీఈ నాగేశ్వరరావు సబ్‌డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

పేదల చెంతకు ఖరీదైన వైద్యం

చంద్రబాబు సర్కార్ వైద్య ఆరోగ్య రంగాన్ని విస్మరిస్తే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య విద్యతోపాటు ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అందులో భాగంగా పశ్చిమ ప్రకాశానికి కేంద్రంగా మార్కాపురంలో చేపట్టిన మెడికల్ కళాశాల పనులు వేగంగా సాగుతున్నాయి. దీంతో పాటు ఇక్కడున్న జిల్లా వైద్యశాలలకు మహర్దశ పట్టింది. ఆస్పత్రి రూపురేఖలు మారిపోయాయి. అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని దాదాపు 7 లక్షల మందికి అత్యాధునిక వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే కష్టాలు తప్పనున్నాయి.

- నెరవేరనున్న పశ్చిమ ప్రకాశం వాసుల మరో కల
- వేగంగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు
- జిల్లా వైద్యశాలకూ మహర్దశ
- చక చకా అభివృద్ధి పనులు
- 21 మంది వైద్యులతో మెరుగైన వైద్యసేవలు
- తీరనున్న ప్రజల కష్టాలు



ఆధునికీకరించిన గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరిక నెరవేరుతోంది. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి నియోజక వర్గాల పరిధిలోని ప్రజలు ఒకప్పుడు అత్యవసర వైద్యం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. సరైన వైద్యం అందక ఈ ప్రాంత ప్రజలు పడిన అవస్థలు అన్నీ ఇన్నీ కావు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. జిల్లా కేంద్రంలో ఇప్పటికే ఒక మెడికల్ కళాశాల ఉండగా పశ్చిమ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు గమనించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కాపురం కేంద్రంగా మెడికల్ కళాశాల ఏర్పాటుకు అనుమతులు ఇచ్చారు. రూ.475 కోట్లతో మార్కాపురం మండలం రాయవరం వద్ద మెడికల్ కాలేజీ పనులు జోరుగా సాగుతున్నాయి. దీనికి అనుబంధంగా జిల్లా వైద్యశాలలో మొత్తం 605 అదనపు బెడ్లు కావాల్సి ఉండగా 420 బెడ్లను సిద్ధం చేస్తున్నారు. నెల రోజుల్లో ఈ బెడ్లు రోగులకు అందుబాటులోనికి రానున్నాయి. నాలుగు నియోజకవర్గాల పరిధిలో సుమారు 7 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. మెడికల్ కళాశాలకు సంబంధించి 39 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా నియమించారు. ఇంకా మరో 15 మంది వరకూ ప్రొఫెసర్లు రానున్నారు. ఆగస్టు నాటికి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు పూర్తిచేసి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ అడ్మిషన్ల కోసం సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్కాపురం పట్టణంలో ఉన్న జిల్లా వైద్యశాల రూపురేఖలే మారిపోయాయి. గతంలో అరకొరగా వైద్యసేవలు అందేవి. చాలా డాక్టర్ పోస్టులు ఖాళీగా ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో జిల్లా వైద్యశాలలో ప్రస్తుతం 21 మంది డాక్టర్లు రోగులకు మెరుగైన సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వైద్యశాలలో 150 బెడ్లు అందుబాటులో ఉన్నాయి. దాదాపు రూ.8 కోట్లతో జిల్లా వైద్యశాలలో అదనపు బెడ్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 450 నుంచి 500 వరకూ ఓపీ విభాగంలో డాక్టర్లు సేవలందిస్తున్నారు. నెలకు 35 నుంచి 40 సర్జరీలు కూడా చేస్తున్నారు.

వైద్యశాలలో అదనపు బెడ్ల ఏర్పాటు ఇలా...

వైద్య విద్యార్థుల కోసం జిల్లా ఆస్పత్రిలో అదనంగా 420 బెడ్లు సిద్ధం చేస్తున్నారు. ఇందులో జనరల్ మెడిసిన్ కోసం 100, ఆప్తమాలజీ విభాగానికి 20, డెర్మటాలజీకి 10, సైకియాట్రి విభాగానికి 10, జనరల్ సర్జరీల కోసం 100, ఆర్థోపెడిక్ విభాగానికి 40, ఈఎన్‌టీకి 20, ఐసీయూ బెడ్లు 20, పీడియాట్రిక్స్ 50, ఓబీజీ (ప్రసూతి, గైనకాలజీ)కి 50 బెడ్లను కేటాయించారు.

605 బెడ్లకు ఇలా...

జనరల్ మెడిసిన్‌కు 150, ఆప్తమాలజీకి 20, డెర్మటాలజీకి 10, సైకియాట్రి విభాగానికి 15, జనరల్ సర్జరీకి 150, ఆర్థోపెడిక్స్‌కు 60, ఈఎన్‌టీకి 20, ఐసీయూకి 30, పిడియాట్రిక్స్‌కు 75, ఓబీజీ (ప్రసూతి, గైనకాలజీ)కి 75 బెడ్లను కేటాయిస్తారు.

24 గంటలూ అందుబాటులో..



మార్కాపురం జిల్లా వైద్యశాలలో వైద్యసేవలు అందించేందుకు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నెలకు 35 నుంచి 40 సర్జరీలు జరుగుతున్నాయి. హెర్నియా, హైడ్రోసిల్, గ్యాంగ్రీన్, ఈఎన్‌టీ, ఆర్థో, డెంటల్ తదితర విభాగాల్లో కూడా సర్జరీలు చేస్తున్నారు. థైరాయిడ్, బ్లడ్ కల్చర్, వివిధ రకాల జ్వరాల నిర్ధారణ టెస్టులు కూడా జరుగుతున్నాయి. వైద్యశాలలో మందుల కొరత లేదు. రోజూ 450 నుంచి 500 మంది పేషెంట్లు వైద్యశాలకు వచ్చి చికిత్స పొందుతున్నారు. రూ.8 కోట్లతో వైద్యశాలలో అదనపు బెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– డాక్టర్ సుబ్బారెడ్డి, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్.

చకచకా మెడికల్ కళాశాల నిర్మాణ పనులు



మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే వివిధ విభాగాలకు సంబంధించి 39 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నియమితులయ్యారు.

– డాక్టర్ రాజమన్నార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ



ఏర్పాటు చేసిన అదనపు బెడ్లు

చెక్‌పోస్టులు పటిష్టంగా పనిచేయాలి

- తనిఖీల వివరాలు ఎప్పటికప్పుడు తెలియచేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీల కోసం ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు మరింత బలోపేతం చేసి పటిష్టంగా పని చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ సభ్యులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభపెట్టేలా మద్యం, డబ్బు ఇతర వస్తువులు తరలిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సీజ్ చేసి సంబంధిత అధికారులకు తెలపాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేస్తున్న దృశ్యాలను ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు. ఆ దిశగా ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌తో పాటు ఈ ఎస్ఎంఎస్ యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పరిధిలో ఉన్న పోలీసు స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు ప్రతిరోజు తనిఖీ చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు మరింత చురుగ్గా పనిచేయాలని ఆదేశించారు. తనిఖీలు, ఎన్నికల సంబంధిత ఇతర విధుల్లో రెవెన్యూ సిబ్బందిని కూడా కేటాయించాలని ఏఎస్పీ నాగేశ్వరరావు కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రాంతాలను బట్టి రెవెన్యూ, అటవీ శాఖ సిబ్బందిని కేటాయిస్తామన్నారు. మాజీ సైనికుల సేవలను కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. సమావేశం అనంతరం ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, ఏఎస్పీ శ్రీధరరావు, డీటీసీ సుశీల, ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆదాయపన్ను పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- ఇంటింటా మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని విజ్ఞప్తి



మంత్రి మేరుగు నాగార్జునకు సాదరంగా స్వాగతం పలుకుతున్న చీమకుర్తి అంబేడ్కర్ నగర్ వాసులు

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. మంగళవారం చీమకుర్తి పట్టణంలోని అంబేడ్కర్ నగర్ పరిధిలోని 1, 4 వార్డుల్లో స్థానిక నాయకులు, కౌన్సిలర్లతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్యాన్ గుర్తుతో పాటు కరపత్రాలు అందించారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించారు. ఈ పథకాలు రానున్న రోజుల్లో కూడా సంపూర్ణంగా అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో ఇప్పటికే రెండు సార్లు వరుసగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారని, ఇప్పుడు మూడోసారి తనను సంతనూతలపాడు ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచారంలో భాగంగా అంబేడ్కర్ నగర్, క్రిష్టియన్‌పాలెంలో ప్రచారానికి వచ్చిన సందర్భంగా స్థానిక దళిత నాయకులు మంత్రి మేరుగు నాగార్జునను సాదరంగా ఆహ్వానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తప్పెట బాబూరావు, నలమల మాణిక్యం, పాటిబండ్ల గంగయ్య, బీమన వెంకట్రావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, స్థానిక నాయకులు దుడ్డు మార్కు, అత్యాల దావీదు, స్థానికులు పాల్గొన్నారు.

అవినీతి 'స్వామి'.. ప్రజలకు చేసిందేమి?

- మంత్రి ఆదిమూలపు సురేష్



ముప్పరాజుపాలెంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి

కొండపి(మర్రిపూడి): రెండు పర్యాయాలు ఓటు వేసి ఎమ్మెల్యేగా గెలిపించిన కొండపి నియోజకవర్గ ప్రజలకు డోలా బాలవీరాంజనేయ స్వామి చేసిందేమీ లేదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సురేష్ విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్కటైనా చేయకపోగా టీడీపీ జమానాలో భారీగా అవినీతికి పాల్పడ్డాడని ధ్వజమెత్తారు. కొండపి మండలంలోని ముప్పరాజుపాలెం, అనకర్లపూడి గ్రామాల్లో మంగళవారం రాత్రి 'పల్లెపల్లెకు సురేష్ అన్న సిద్ధం' ఎన్నికల ప్రచార కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో పేదలకు మరుగుదొడ్లు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ఎమ్మెల్యే స్వామి, అతని అనుచరులు దొంగ బిల్లులతో కాజేశారని దుయ్యబట్టారు. నీరు-చెట్టు పేరుతో ప్రజాధనాన్ని టీడీపీ నేతలు లూటీ చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్ గడిచిన 58 నెలల్లో 130సార్లు బటన్ నొక్కి డీబీటీ రూపంలో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమ చేశారని పేర్కొన్నారు.

ఒక్క అవకాశమివ్వండి..

వైఎస్సార్ సీపీ పాలనలోనే కొండపి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేసినట్లు పేర్కొన్నారు. సచివాలయ భవనాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలు, బల్క్ మిల్క్ సెంటర్ల నిర్మాణంతో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన మూడు నెలల్లోనే మండలంలో రహదారులను అభివృద్ధి చేయడంతోపాటు బోర్లకు మరమ్మతులు చేయించానని, అవసరమైన చోట నూతన బోర్లు వేయించానన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1.15 కోట్లను పార్టీలకు అతీతంగా అందజేశానన్నారు. కొండపి నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండపి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, జేసీఎం కన్వీనర్ గొట్టిపాటి మురళి, వైస్ ఎంపీపీ వేమూరి ప్రసాద్, సర్పంచ్‌లు సులోచన, ధనలక్ష్మి, పరుచూరి సుబ్బయ్య, వలేటి రామచంద్రయ్య, నరసింహారావు, బొక్కిసం సుబ్బారావు, చింతల వెంకటేశ్వర్లు, మారెడ్డి వెంకటాద్రి, వేముల రమేష్ పాల్గొన్నారు.

887 మంది రౌడీ షీటర్లు బైండోవర్

- 426 మంది ఎలక్టోరల్ అఫెండర్లు కూడా
- సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ బలగాల కవాతు నిర్వహణ
- ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం
- జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టుల ద్వారా నిరంతర తనిఖీలు
- చెక్‌పోస్టుల్లో రూ.1.80 కోట్ల నగదు, బంగారం, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాలు స్వాధీనం
- 40 కేజీల పాంగోలిన్ జంతు పొలుసులు కూడా స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ పరమేశ్వర రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ పరమేశ్వర రెడ్డి

ఒంగోలు సబర్బన్: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపట్టామని ఎస్పీ పీ.పరమేశ్వర రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఎన్నికల సందర్భంగా చేస్తున్న కార్యకలాపాలపై ప్రకటన విడుదల చేశారు. ఓటర్లకు స్వేచ్ఛాయుత వాతావరణం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా 887 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేసుకున్నామన్నారు. మరో 144 మందిని బైండోవర్ చేసుకునే ప్రక్రియలో పోలీస్ అధికారులు ఉన్నారన్నారు. వారితో పాటు 426 మంది ఎలక్టోరల్ అఫెండర్లను కూడా బైండోవర్ చేసుకున్నట్లు వెల్లడించారు. ఎలక్టోరల్ అఫెండర్లను బైండోవర్ చేసుకోవటంతో పాటు వారి నడతను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జిల్లా పోలీస్ యంత్రాంగం నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఇతర జిల్లాల నుంచి ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పదంగా ఉన్నవారు, రౌడీ షీటర్లు జిల్లాలోకి వస్తే ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని వారిపై కూడా పూర్తి స్థాయిలో నిఘా ఉంచుతామని పేర్కొన్నారు. బైండోవర్ షరతులను ఎవరైనా ఉల్లంఘిస్తే ఐపీసీ సెక్షన్ల ప్రకారం వారిపై పోలీసులు తీసుకొనే చర్యల గురించి రౌడీ షీటర్లకు క్షుణ్ణంగా వివరించి కౌన్సెలింగ్‌లు కూడా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోకి వచ్చే వారిపై, జిల్లా నుంచి బయటకు వెళ్లే వారిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 చెక్ పోస్టుల ద్వారా పోలీస్ అధికారులతో పర్యవేక్షణ చేయిస్తున్నామన్నారు. తగినంత మంది సిబ్బందితో అక్రమ మద్యం, నగదు, మాదక ద్రవ్యాలు, విలువైన లోహాలు, వస్తువులు, ఉచిత పంపిణీ సామగ్రివంటి వాటిపై ప్రత్యేకంగా నిఘా పెట్టామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో రూ.1.80 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. 214 గ్రాముల బంగారం, 1,872 లీటర్ల అక్రమ మద్యం, 80.30 గ్రాముల మాదక ద్రవ్యాలతో పాటు 40 కేజీల పాంగోలిన్ జంతువుకు చెందిన పొలుసులు వాహన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల్లో సాయుధ దళాలతో స్థానిక పోలీసులను కలుపుకొని కవాతు నిర్వహిస్తున్నామని, గ్రామాల్లో ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ) గురించి అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహిస్తూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించే ముందు సంబంధిత అధికారుల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లు సమాచారం తెలిస్తే సీ-విజిల్ యాప్ ద్వారా లేదా పోలీస్ డయల్ 112 ద్వారా, స్థానిక పోలీసులకు కూడా సమాచారం అందించవచ్చన్నారు. ఎవరు నియమావళిని అతిక్రమించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

- వచ్చే నెల 8న సాగర్ జలాల విడుదలకు అవకాశం
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రజలకు వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రకాశం భవనంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 8వ తేదీ సాగర్ జలాలు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఐదు రోజుల తర్వాత సాగర్ నీరు జిల్లాకు వస్తుందన్నారు. నీళ్ల చోరీకి గురికాకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ సిబ్బందితో పహారాకు చర్యలు తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌తో కూడా చర్చిస్తానని చెప్పారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వీలైనంత త్వరగా నింపడంపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో చేతి పంపుల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీపీవో, జెడ్పీ సీఈఓలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఈ నిధులు ఖర్చు చేస్తున్న తీరును ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించాలన్నారు. చేతిపంపుల స్థితిగతులపై ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ప్రతి వారం నివేదిక తెప్పించుకోవాలన్నారు. నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడంపై ప్రజలకు, గ్రామ జల సంఘాల్లోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రౌండ్ వాటర్, డ్వామా అధికారులు సమన్వయంతో పనిచేసి భూగర్భ నీటి మట్టం పెరిగేలా పనులు చేపట్టాలన్నారు. మంచినీటిని సరఫరా చేస్తున్న ట్యాంకర్లపై రాజకీయ పార్టీల గుర్తులు, నాయకుల ఫొటోలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ అలీ, డీఆర్‌డీఏ పీడీ వసుంధర, డ్వామా పీడీ అర్జున్‌రావు, డీపీవో ఉషారాణి, జెడ్పీ సీఈఓ మాధవి, మున్సిపల్ కమిషనర్‌లు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.



తాగునీటి సరఫరాపై సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వాహ్ సోలార్ బైక్ !

- నూతన ఆవిష్కరణకు శ్రీకారం చుట్టిన క్విస్ ఇంజినీరింగ్ విద్యార్థులు



విద్యార్థులు రూపొందించిన సోలార్ ద్విచక్ర వాహనం

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం విద్యార్థులు సంయుక్తంగా గేర్ ఆధారిత సోలార్ ద్విచక్ర వాహనాన్ని రూపొందించారు. ఈ ఎలక్ట్రిక్ వాహనం ప్రత్యేకత పరిశీలిస్తే రివర్స్‌తో సహా గేర్ ఆధారిత వాహనం. దీనివల్ల వినియోగదారునికి సంతృప్తికరమైన స్పీడ్ రేంజిలలో డ్రైవ్ చేసే సౌలభ్యం ఉంటుంది. హైబ్రిడ్ ఈవీ-సోలార్, బ్యాటరీతో ఎండ ఉన్న రోజుల్లో నిరంతరంగా పనిచేస్తుంది. ప్రాజెక్టులో ఉపయోగించిన సాంకేతిక వివరాలను పరిశీలిస్తే 48 ఓల్ట్ డీసీ, 35 ఆంపియర్లు, వెయ్యి వాట్ల డీసీతో తక్కువ ధర స్పీడ్ కంట్రోలర్, 48 ఓల్టుల 20 ఏహెచ్‌తో లిథియం అయాన్ బ్యాటరీ ఉపయోగించారు. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ బి.మౌళి చంద్ర మార్గదర్శకత్వంలో విద్యార్థులు ప్రాజెక్టు తయారు చేశారు. విద్యార్థులను చైర్మన్ డాక్టర్ ఎస్ ఎస్ కళ్యాణ చక్రవర్తి అభినందించారు.

క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన ముజీబ్

కురిచేడు: మిత్రులను కలిసేందుకు వెళ్తున్న ఓ యువకుడిని మృత్యువు బలితీసుకుంది. ఈ సంఘటన కురిచేడు మండలంలోని పెనగమూరు వద్ద మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు.. దర్శికి చెందిన ముజీబ్(26) తన మిత్రులను కలిసేందుకు కురిచేడు రైల్వేస్టేషన్‌కు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యంలో పెనగమూరు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ముజీబ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న వాహనదారులు గమనించి 108కి సమాచారం అందించారు. ముజీబ్‌కు 108 సిబ్బంది అబీద్‌వలి, వరకుమార్ ప్రథమ చికిత్స చేసి, దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా కన్నుమూశాడు. మిత్రులను కలవాలని బయలుదేరిన ముజీబ్ వారిని కలవలేనంత దూరం వెళ్లిపోయాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

యలమంద వాగులో గుర్తు తెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

దొనకొండ: మండల పరిధిలో దొనకొండ నుంచి రుద్రసముద్రం వెళ్లే రోడ్డులోని యలమంద వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. ఎస్సై ఎల్ సంపత్ కుమార్ వివరాల మేరకు..గుర్తు తెలియని వ్యక్తి వయసు 55 నుంచి 60 ఏళ్ల మధ్య ఉంటుందని, మృతుడు తెలుపు రంగు చొక్కా, ఎరుపు రంగు అంచు పంచె, తెలుపు రంగు టవల్ ధరించి ఉన్నాడన్నారు. వీఆర్‌ఓ హరినారాయణ సమాచారం మేరకు తమ సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల అదృశ్యంపై కేసు నమోదు

కనిగిరి రూరల్: ఇద్దరు విద్యార్థులు అదృశం కావడంతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కాకర్ల అవినాష్, షేక్ కరీముల్లాలు తెల్లవారుజాము నుంచి కన్పించకుండా వెళ్లిపోయారు. ఎక్కడా వెతికినా కన్పించకపోవడంతో స్కూల్ వార్డెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై త్యాగరాజు తెలిపారు.

చీటింగ్ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడు బాలన్న అరెస్ట్ చూపుతున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : తమ కంపెనీలో డిపాజిట్ చేస్తే రెట్టింపు ఇస్తామని పలువురి నుంచి వసూళ్లు చేసి మోసం చేసిన కేసులో నిందితున్ని అరెస్ట్ చేసినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నిందితున్ని అరెస్ట్ చేసి, కేసుకు సంబంధించిన వివరాలు విలేకరులకు వెల్లడించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరుకు చెందిన ఇనపర్తి బాలన్న అలియాస్ బాలరాజు నంద్యాల టౌన్‌లో ఉంటూ విన్ ఇండియా ఆయుర్వేదిక్ కాస్మోటిక్ అండ్ జనరల్ స్టోర్స్, మహిమా ఆయుర్వేదమ్ అను రెండు కంపెనీలకు ఎండీ అని, పై కంపెనీలపై బాలన్న అకౌంట్‌లు ఓపెన్ చేశాడు. ఆయన స్నేహితుడైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలానికి చెందిన హైజాక్‌తో కలసి 2023 మార్చి నెలలో పీలేరుకు వచ్చారు. పీలేరు పట్టణంలో నివాసం ఉన్న మల్లికార్జున, మురళీ అనే టీచర్లతో పరిచయం చేసుకున్నారు. వారి కంపెనీలో రూ.1 లక్ష డిపాజిట్ చేస్తే 20 వారాలకు రూ. 1.80 లక్షలు ఇస్తామని చెప్పి డిపాజిట్లు చేయించుకున్నారు. అనంతరం సెప్టెంబర్‌లో పీలేరుకు చెందిన టీచర్ ఖాదర్‌వల్లి వద్ద రూ.7.75 లక్షలు డిపాజిట్ చేపించుకున్నారు. అదే విధంగా పీలేరులో సుమారు 50 మంది దగ్గర రూ.8 కోట్లు వరకు డిపాజిట్ చేయించుకున్నారు. ఇందులో సుమారు రూ.4 కోట్లు ఇరిగి ఇచ్చి మిగతా డబ్బులు మోసం చేశారు. బాధితుడు ఖాదర్‌వల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలన్నపై కేసు నమోదు చేసిన పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. పరారీలోఉన్న హైజాక్‌ను త్వరలో అరెస్ట్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్‌ఐ నరసింహుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

- డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి



సన్మానం అందుకుంటున్న బూచేపల్లి వెంకాయమ్మ, డాక్టర్ శివప్రసాదరెడ్డి

దర్శి: పార్టీలకతీతంగా సంక్షేమం–అభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని త్రిపురసుందరీపురం, ఉయ్యాలవాడ గ్రామాల్లో మన ఊరుకు మన శివన్న కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ట్రాక్టర్ నడిపి రైతులను ఉత్సాహ పరిచారు. బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత కరోనా వంటి విపత్తులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవడమేగక రాష్ట్రం కష్టాల్లో ఉన్నా అన్నీ సంక్షేమ పథకాలు అమలు చేసిన గొప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. చంద్రబాబు పాలనలో కరువుతో ప్రజలు అల్లాడారని గుర్తు చేశారు. వర్షాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. మళ్లీ అందరికీ పథకాలు అందాలంటే వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలన్నారు. మీ ఆశీర్వాదాలు తనకు అందించి అత్యధిక మెజార్టీతో గెలిపించి దర్శి నియోజకవర్గానికి సేవ చేసే భాగ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారు కాబట్టే ఎటువంటి పొత్తుల లేకుండా ఒంటరిగా పోటీ చేస్తున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు పాలనలో దోచుకోని దాచుకున్నందునే ఇప్పుడు ఆ డబ్బుతో ప్యాకేజీలు ఇచ్చి పొత్తులు పెట్టుకుంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన కుమారుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వెంకాయమ్మ విజ్ఞప్తి చేశారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఉయ్యాలవాడ సర్పంచ్ పోతంశెట్టి మురళి, త్రిపురసుందరిపురం సర్పంచ్ వెన్నపూస అమల, మాజీ ఎంపీటీసీ గాలం కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొరివి మునలయ్య, సోము దుర్గారెడ్డి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పాశం జయసింహారావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ సంయుక్త కార్యదర్శి వెన్నపూస బాపిరెడ్డి, సర్పంచ్‌లు రాము, సుబ్బారెడ్డి, అంకాల శ్రీను, తాళ్లూరు మండలం మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు పులి కృష్ణారెడ్డి, గాలం ఏడుకొండలు, గాలం శ్రీను, పోటు శ్రీనివాసరావు, పిన్నికి వెంకటేశ్వర్లు, గాలం పెద్ద బాలకోటయ్య, చిన్న శ్రీణు, ఉప సర్పంచి సంగన నాగిరెడ్డి, గోవిందరెడ్డి, వెంకట నర్సారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

అంతర్‌జిల్లాల దొంగ అరెస్టు

- రూ.2.52 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రెహమాన్

మార్కాపురం: అంతర్‌జిల్లాల దొంగను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.52 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం పట్టణ, మండలం, కంభం, వినుకొండ పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ దొంగతనాలకు పాల్పడిన షేక్ సుభానీని మార్కాపురం ఆర్టీసీ బస్టాండు వద్ద అదుపులోనికి తీసుకుని విచారించగా దొంగతనం వివరాలు తెలిపాడన్నారు. ఎస్సై షేక్ అబ్దుల్ రెహమాన్ వచ్చిన సమాచారం మేరకు..సిబ్బందితో ఆర్టీసీ బస్టాండ్ వద్దకు వెళ్లగా పోలీసు జీపును చూసి సుభానీ పారిపోయేందుకు ప్రయత్నించగా అదుపులోనికి తీసుకొని విచారించామని తెలిపారు. బేల్దారీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే సుభానీ..జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడేవాడన్నారు. నిందితునిపై గతంలో పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేసినట్లు పేర్కొన్నారు. శ్రీనివాసనగర్‌కు చెందిన స్నేహితుడు శివతో కలిసి మార్కాపురం పట్టణ, మండలం, కంభం, వినుకొండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వివిధ దొంగతనాలకు పాల్పడినట్లు తెలిపారు. సెల్‌ఫోన్లు, మోటార్ బైకులు అపహరించి తక్కువ ధరకు విక్రయించాడు. దీంతో మార్కాపురం, కంభం, వినుకొండ పోలీసుస్టేషన్‌ల పరిధిలో నమోదైన కేసుల్లో నిందితునిగా భావించి సోమవారం రాత్రి 8 గంటల సమయంలో సుభానీని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.2.52 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. రెండో నిందితుడు శివ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు దొంగలించిన మోటారుసైకిళ్లను తక్కువ ధరకు రిజిస్ట్రేషన్ పేపర్లు లేకుండా కొనుగోలు చేసిన పట్టణానికి చెందిన దుర్గా ప్రసాద్‌ను కూడా నిందితునిగా చేర్చినట్లు పేర్కొన్నారు.

ఆటో, పొగాకు ట్రాక్టర్ ఢీ



మోపాడు వద్ద లక్ష్మీ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నరేష్

- ఒకరు మృతి, ఇద్దరికి స్వల్పగాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

కందుకూర రూరల్: ఆటోను పొగాకు ట్రాక్టర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మోపాడు గ్రామం వద్ద మంగళవారం ఉదయం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... కందుకూరు పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కాలనీకి చెందిన తొమ్మిది మంది మహిళలు ఆటోలు వలేటివారిపాలెం మండలం నదలదపూరు గ్రామ పొలాల్లో ఎండు పొగాకు సేకరించుకునేందుకు వెళ్తున్నారు. మోపాడు వద్దకు వెళ్లే సరికి ఎదురుగా వస్తున్న పొగాకు ట్రాక్టర్ దోరు ఆటోకు ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కనే ఉన్న కాలువలోకి పడింది. ప్రమాదంలో ఆటో వెనుక వైపు కూర్చొని ఉన్న డాలు లక్ష్మి (45) తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. బి.లక్ష్మి, కె.ఉమాలకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ ఎస్సై నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పొగాకు చెక్కుల ట్రాక్టర్ నలదలపూరు గ్రామానికి చెందినదిగా చెప్తున్నారు. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఎండు ఆకుకు వెళ్తూ మృత్యు ఒడికి..

మృతురాలు లక్ష్మి భర్త హరిబాబు డయాలసిస్ పేషెంట్. రోజు మార్చి రోజు కందుకూరులోనే డయాలసిస్ చేయించుకుంటుంటాడు. వీరికి ముగ్గురు పిల్లలు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, కుటుంబ పరిస్థితి బాగా లేకపోవడంతో కుమారుడు చదువు మానేసి బేల్దారి పనులకు వెళ్తుంటాడు. పెద్ద కుమార్తె ఒంగోలులో హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాస్తుంది. మరో అమ్మాయి కందుకూరులోనే తొమ్మిదో తరగతి చదువుతుంది. లక్ష్మీ కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుంది. ప్రస్తుతం పొగాకు సీజన్ కావడంతో ఎండు ఆకు ఏరుకునేందుకు కాలనీలోని మహిళలతో కలిసి వెళ్లి తెచ్చి విక్రయించుకుంటారు. భర్త ఆరోగ్యంతో పాటు కుటుంబ పోషణను లక్ష్మీనే చూసుకోవాలి. లక్ష్మి మృతితో కుటుంబ పరిస్థితి అయోమయంలో పడింది. కుటుంబాన్ని నెట్టుకొచ్చే లక్ష్మి మృతి చెందడంపై కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఆటోను ఢీకొన్న ట్రాక్టర్ ఆటోలో ఉన్న మహిళలు కేకలు వేస్తున్నా నిలపకుండా వెళ్లిపోయాడు. ట్రాక్టర్ నలదలపూరు గ్రామానికి చెందినదిగా గుర్తించినట్లు సమాచారం. అయితే అదే గ్రామ పొలాలో ఎండు ఆకు ఏరుకునేందుకు వెళ్తున్న మహిళలు రైతులకు తెలియకుండా ఆకును ఏరుకొని వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో ఏమైనా జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆస్తి, నీటి పన్నుపై వడ్డీ మాఫీ



అధికారులతో సమీక్షిస్తున్న ఒంగోలు నగర కమిషనర్ జశ్వంతరావు

- ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలి
- 5 రోజుల్లో 95 శాతం పన్ను వసూలు చేయాలని లక్ష్యం
- పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి
- అధికారులతో సమీక్షలో ఒంగోలు నగర కమిషనర్ జశ్వంతరావు

ఒంగోలు సబర్బన్: ఆస్తి పన్ను, నీటి పన్నుపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ మాఫీ చేసిందని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని నగర పాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఎం.జశ్వంతరావు విజ్ఞప్తి చేశారు. సెలవు రోజుల్లోనూ నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా పన్ను కట్టించుకుంటున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం కమిషనర్ తన చాంబర్‌లో వార్డు సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులతో విడివిడిగా సమీక్షించారు.నగరంలో ఆస్తి పన్ను, మంచినీటి కుళాయి పన్ను, ఖాళీ స్థలం పన్ను, వ్యాపార లైసెన్స్‌లు, ఆక్రమణ పన్నులు, యూజర్ చార్జీల వసూళ్ల తీరుపై సమాచారం రాబట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత మూడేళ్ల నుంచి ఆస్తి పన్ను వసూళ్లలో పురోగతి ఆశించిన స్థాయిలో లేదన్నారు. ప్రభుత్వం ఆస్తి పన్నుపై వడ్డీ కూడా మాఫీ చేసిందని, ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి వసూళ్లలో వేగం పెంచాలన్నారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అధికారులు, సిబ్బంది వార్డు సచివాలయాల పరిధిలో పర్యటించి పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. ఆర్థిక సంవత్సరం చివరి దశకు చేరుకున్నందున్న ఈ ఐదు రోజుల్లో రోజూ రూ.కోటి చొప్పున వసూలు చేయాలని దిశానిర్దేశం చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను 95 శాతం పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, పన్ను వసూలు చేయని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

ఒంగోలు నగరంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. నగరంలోని వ్యాపారులు, టీ బంకుల యజమానులు తమ దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను రోడ్లపై వేయకుండా పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. స్థానిక ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదుల రాకుండా శానిటరీ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి రోడ్లు, కాలువలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా వాహనాలకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

ఒంగోలు: పదో తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.సుభద్ర తెలిపారు. పదో తరగతి రెగ్యులర్ బయాలజీ పరీక్షకు 29356 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 29103 మంది, ప్రైవేట్ విద్యార్థులు 1112 మందికి గాను 515 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు 5, డీఈఓ 4 కేంద్రాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ 95 సెంటర్లను తనిఖీ చేయగా.ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పదో తరగతి సోషల్ పరీక్షకు 1494 మందికి గాను 1313 మంది హాజరయ్యారని, ఇంటర్ కెమిస్ట్రీ పరీక్షకు 3345 మందికి గాను 3039 మంది, ఎకనామిక్స్ పరీక్షకు 1515 మందికి గాను 1365 మంది హాజరయ్యారు. జిల్లాలో 4860 మందికి గాను 4404 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

టీచర్ దంపతులపై చీటింగ్ కేసు

మార్కాపురం: డబ్బు అప్పుగా తీసుకుని ఏకంగా ప్రామిసరీ నోట్లు మాయం చేసిన టీచర్ దంపతులపై మార్కాపురం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్ కథనం మేరకు.. మార్కాపురం కోర్టులో టైపిస్టుగా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి ప్రతి ఆదివారం తన ఇంటి సమీపంలో ఉన్న చర్చి వద్దకు వెళ్లి పేదలకు భోజనం పెడుతుంది. ఈ క్రమంలో ఆమెకు సునీత, వీరయ్య అనే టీచర్లు పరిచయమయ్యారు. తమకు డబ్బు అవసరం ఉందని, రూ.4 లక్షలు అప్పుగా కావాలని టీచర్ దంపతులు కోరడంతో కోర్టు టైపిస్ట్ ప్రామిసరీ నోట్లు రాయించుకుని ఇచ్చారు. ఇటీవల చర్చి వద్ద ప్రామిసరీ నోట్లు చూపించి డబ్బు ఇవ్వాలని కోరగా త్వరలోనే ఇస్తామని టీచర్ దంపతులు చెప్పారు. కొంతసేపటి తర్వాత టైపిస్ట్ వద్ద ఉన్న ప్రామిసరీ నోట్లు మాయమయ్యాయి. టైపిస్ట్ మరోమారు డబ్బు గురించి ప్రస్తావించగా టీచర్ దంపతులు ప్రామిసరీ నోటు చూపాలని అడిగారు. దీంతో టైపిస్ట్ తనకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేయడంతో కేసు నమోదు చేయాలని పోలీసులకు కోర్టు సిఫార్సు చేసింది. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సత్తా చాటిన వైఎస్సార్ జిల్లా గిత్తలు



పోటీల్లో బండ లాగుతున్న ఎడ్లు

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి తిరునాళ్ల సందర్భంగా మంగళవారం రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం ఎడ్ల పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీలో వైఎస్సార్ జిల్లా చౌటపల్లెకు చెందిన మార్తాల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎడ్లు 3809 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.లక్ష, చంద్ర ఓబుల్‌రెడ్డి మరో ఎడ్ల జత 3,363 అడుగులు లాగి రెండో బహుమతి కింద రూ.70 వేలు గెలుపొందాయి. వైఎస్సార్ జిల్లా బాలుగారిపల్లెకు చెందిన రమణారెడ్డి ఎడ్లు 3,351 అడుగులు లాగి మూడో బహుమతి రూ.50 వేలు, గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన తిశగ్నరెడ్డి జస్విత్‌రెడ్డి ఎడ్లు 2,548 అడుగులు లాగి నాలుగో బహుమతి రూ.30 వేలు, రాచర్ల మండలం సత్యవోలుకు చెందిన బత్తుల బాలరాజు ఎడ్లు 2,465 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.20 వేలు, గుంటూరు జిల్లా కుంచనపల్లెకు చెందిన తిశగ్నరెడ్డి జస్విత్ రెడ్డి ఎడ్లు 2,400 అడుగులు లాగి ఆరో బహుమతి కింద రూ.10 వేలు, గిద్దలూరుకు చెందిన దుర్వేసుల నారాయణ ఎడ్లు 2,144 అడుగులు లాగి 7వ బహుమతి రూ.7 వేలు దక్కించుకున్నాయి. ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు, పశుపోషకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పోటీలను ఎమ్మెల్యే సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.లక్షను విజేతలకు తనవంతుగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాండురంగారెడ్డి, వెంకటస్వామి, నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లెక్కలేనితనమే అ‘జెండా’!

పొదిలి: ‘మనల్నెవడురా ఆపేది’ అని జనసేనాని పవన్ కల్యాణ్ గతంలో చేసిన వ్యాఖ్యలను జనసేన నాయకులు బాగానే వంటబట్టించుకున్నారు. కోడ్ అమలులో ఉన్నపుడు ప్రజలకు బాహాటంగా కనిపించేలా బ్యానర్లు, జెండాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా అవి తమకు వర్తించవన్నట్టుగా జనసేన నాయకులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి మరీ పొదిలి పట్టణంలోని దర్శి రోడ్డులో పెట్రోలు బంకు సమీపంలో జనసేన జెండా ఎగురవేశారు. అధికారులు వెంటనే స్పందించి జెండాను తొలగించాలని, కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పొదలి-దర్శి రోడ్డులో జనసేన జెండా

బాలికల అభ్యున్నతికి కృషి



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీఓ ప్రమోద

- జీసీడీఓ ప్రమోష

పుల్లలచెరువు: బాలికల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జీసీడీఓ ప్రమోద అన్నారు. స్థానిక కేజీబీవీ బాలిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంట గదులు, మరుగుదొడ్లు, గ్రంథాలయాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల తీరు, విద్య, పాఠశాలలో వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలపై శిక్షణలో నేర్చుకున్న అంశాలను తెలుసుకుని విద్యార్థులకు చక్కటి బోధన అందచేయాలన్నారు. విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ గురించి తెలియజేసి ఉపయోగాలను వివరించలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పాఠశాలలో దాతలు సమకూర్చిన వస్తువులపై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులపై ప్రిన్సిపాల్‌ను అభినందించారు. ఆమె వెంట ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి పాల్గొన్నారు.

వ్యాలి వాహనంపై ఊరేగిన వేంకటేశుడు



వ్యాలి వాహనంపై శ్రీవారు

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండలో బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి వ్యాలి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితులు ప్రసాదాచార్యులు, పవన్‌కుమార్‌శర్మ అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని, కొండపై ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. గంగమ్మ సన్నిధిలో పూజలు చేశారు. దివంగత దర్శి మాజీ ఎమ్మెల్యే సానికొమ్ము పిచ్చిరెడ్డి, సానికొమ్ము కొండారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్న కేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, ధర్మకర్తలు పర్యవేక్షించారు. బుధవారం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిస్తారని ఆలయ ఈఓ, చైర్మన్ తెలిపారు.